# మా కిస్ పెళ్ళాం

శ్రీ బి.వి.శర్మ

మా కిస్‌గానికి మంచి అందమైనమ్మాయిని పెళ్లి చేసికోవాలనీ—ఆ అందమనేది మా రావూ, స్వాముల భార్యలను మించేట్టుండాలనీ, వాడియుద్దేశ్యం.

మేమంతా రూం మేట్సమయిదుగురం. వారిలో మూర్తికీ, నాకూ కిస్‌గానికీని—పెళ్లికానిది. అయినప్పటికీ మేమంతా ఉమ్మడిగానే కాలేజీ జీవితం గడిపేస్తున్నాము.

అసలు మాలో పెళ్లిగొడవ తలపెట్టింది వాడే. పెళ్లిచూపులకని వాళ్ల మావ వ్రాయటమే తడవుగా కాలేజీకు 3 రోజులు శెలవుపెట్టి మరీ పోయేవాడు.. ఆవిధముగా యీసంవత్సరమున్నరలో ఏ ఇరవైసార్లో వెళ్లుంటాడు. అంటే — అంత మంది పిల్లలను చూచాడన్నమాట.

వెధవాయ్! పెళ్లిరావటమూ, ఏదో వంకలు పెట్టడమూ, వాడికి పరిపాటైపోయింది. రూముకు చేరడంతోనే.

"అబ్బే! నల్లగా—గునపాములా వుందిరా పిల్ల?" అన్నైనా...

"ఈతడవ చూచినమ్మాయి—నాకు అందొచ్చేట్టే లేదురా." అనిగాని అనేశేవాడు తేలిగ్గా. ఇంకోప్పుడు.

"నిన్న చూచినమ్మాయి—పొలములోని పోలిగాని (గడ్డి బొమ్మ)లా మరీ సన్నగావుందిరా అనిగాని, "ఒరేయ్! ఇంతకు ముందెప్పుడూ చూచి యెరగని పరమ ఖోజ్జాలావుందిరా—ఏలా చేసికోనూ?" అనిగాని అంటూండేవాడు.

"అందమైన పిల్లే అయినప్పటికీ, గుణాలెటువంటివో స్వయంగా తెలిసికొని మరీ చేసికోవాలిరా!" అన్నాడోసారి, బహుతీరిగ్గా, మా రావుకు మండి.

"అసలు నీవింకోటిచేస్తే బావుంటుంది—పెళ్లిచూపులుకెళ్లేసి, ఓరోజామ్మాయితో గడిపేస్తే నాణ్యముకూడ తెలుస్తుంది గదరా." అన్నాడు. మేమంతా ఒక్క శృతిలో పడ్డాము. వాడు ఉడుక్కు చచ్చాడు.

వాడిపెళ్లి బహు తమాషాగా కనబడినా, వాడి మామకు మరీ విసిగెత్తించింది. అది మావాడూ పసిగట్టి, ప్లాటుమార్చేశాడు.

తాను వెళ్లటానికి బదులు—పిల్లల ఫోటోలను పంపించమని వాళ్ల మావకు వ్రాశాడు. ఇది కొంతవరకు బావుందంటే — బావుందనుకున్నామందరమూను.

ఈవిధముగా కూడ, మూడుఫోటోలు రావడమూ, వాటిని తిరిగి పంపించేయుటమూ జరిగింది. మాకు కనబడని లోపాలనేవో వర్ణించిచెప్పేవాడు. అటువంటివాడు, చివరికోనాడు, నాలుగో ఫోటోను చూపెట్టి—తనకన్నివిధాల తగినదీ అమ్మాయేననీ; పేరు సరోజినీ, అని చెప్పి, పొంగిపోవటమేగాకుండా, 'సరూ'—అని ముద్దు పేరుకూడా పెట్టుకున్నాడాప్యాయంగా. మేమంతా ఆశ్చర్యపడి పైకెత్తేశాము—వాణ్ణి.

నిజానికామ్మాయి తగిన కను, ముక్కు, తీరు కలిగియుంటమేగాకుండా—చూడటాని కప్సరసను మించేట్టే కనిపించింది. చివరికేలాగో—వాడే పంతము పండించుకున్నాడనుకున్నాము. కాని, "యీ సందిగ్ధపు వెధవతో-ఏలా వేగుతుందోరా! పాపం!" అని వాళ్లంతా—ఆ అమ్మాయిపట్ల సానుభూతి చూప మొదలెట్టారు.

ఇహను మావాడికి పట్టపగ్గాలు లేవు. ఆ రోజునమమ్మల్నందరినీ. ఏనాలుగుసార్లో హోటలుకు తీసికివెళ్లుంటాడు. అంతేగాకుండా,

"పిల్ల అంగీకరించబడినది. వెంటనే నిశ్చయంచుకో,"

—క్రిష్." అని వాళ్ళ మావకు తంతి యిచ్చాడు.

వాణ్ని మేము Kiss (కిస్)అని ఏడిపించటానికిగల కారణం—పేరు కృష్ణా అయినప్పటికీ—వాడు క్రిష్ అని పిలుచుకోవాలని, తహతహలాడ్డమే.

సరే! ఏలాగైతే నేమి; మూడవనాటికల్లా జవాబు రానేవచ్చింది—పెళ్లి నిశ్చయపడినట్లూ—లగ్నానికింకా పదిరోజులు గడువున్నట్లూను.

ఇహను మావాడు లగ్నాని కెదురుచూడని రోజంటూ లేదు. రోజూ తారీఖు లెక్కపెట్టే వాడు. కాబోయే పెళ్లాంమీద కమ్మని కలలుకంటూన్నానని చెప్తూ సంతోషించే వాడు.

మా అందరి Selection మీద తనకు మంచి మంచి సూట్లు కుట్టించుకోవడమేగాకుండా—అందరికీ ఆకర్షణీయముగా వుండే. బృందా చీరనొకదానిని కొనేశాడు వాళ్లావిడకని.

ఏమైతేనేమి, లగ్నానికింకోరోజు ముందుగా, మేమంతా బయలుదేరిపోయాము. మా పెళ్లికొడుకు Kiss (ముద్దు) గాడి తరఫున- మానలుగురికీ ఒక ప్రత్యేక రూము నిచ్చారా మేడలో. అది మాకెంతో అనుకూలముగా వుంది.

సౌకర్యాల విషయమడగటానికి మాముద్దుగాడెప్పుడూ, మారూములోకి వస్తూ, తనకింకా పెళ్లాన్నిచూడ్డానికెటువంటి అవకాశమూ చిక్కలేదని చెప్తూండేవాడు.

ఎక్కడ చూచినా వాడే. తనో సుందరాంగికి భర్త నవుతూన్నాను కదా—అన్న సంతోషముతో, మాకిస్ గాడా మేడలో తెగతిరిగేవాడు.

మధ్యాహ్నము 2 గంటలకు లగ్నము. పెండ్లి పీటమీద మావాడు కూర్చొని పెళ్లికూతురు 'సరూ' కోసము తెగ ఆతురత పడుతూన్నాడు. నిజానికి మాకూ ఆలా నేవుంది.

నిండు ముసుగుతో మావాడి 'సరూ'ను వాడికి ప్రక్కగా కూర్చోబెట్టింది, అత్తగారు. అప్పటికి ఒక అవయవమూ పైకి కన్పించరానంతయిదిగా సరిపెడుతుం దావిడ ప్రక్కనుండి "దిష్టి తగులుతూందనో లేక యీ ఎండకు కందిపోతుందనో—పూర్తిగా ముసుగేసుంటారని మేమొకరి నొకరు చూచుకున్నాము.

మావాడు చూచాడు—చూచాడు; విసిగెత్తి ఒక్కసారి ముసుగు క్రిందికిలాగేశాడు. ఉన్నవాళ్లంతా ఆశ్చర్యపోయారు. మావాళ్లందరూ పొట్టచేతులతో పట్టుకొని ఒక్కొక్కడూ బయటికి జారారు.

నేను ధైర్యముతో, "చంద్రబింబ—వదనా" అన్న రికార్డును వేసి కమ్మగా వింటూన్నా. మావాడి కష్టాలే ముచ్చెమటలూ పోశాయి—కాని వాడి ముఖముమీద కోతులు చమ్మచెక్క లాడుకుంటూన్నాయి.

పాపమామ్మాయి బిక్క చచ్చిపోవటమే గాకుండా, కళ్లమ్మట నీరు గ్రుమ్మరించటము స్పష్టముగా చూచాను నేను. మావాడేమనుకున్నాడో, ఏమో—ఇట్టే మంగళసూత్రధారణ కానిచ్చేశాడు.

అంతమంది పిల్లల నీవంక బెట్టినందుకు మా మొద్దు (ముద్దు) గాడికి తగినశాస్తి అయిందిరా అనుకున్నాము. తప్పెవరిదీ?

ఏదెలాగునైనా, "పాపమామ్మాయి ఫోటో కోసం, ఎన్ని లైట్లుపయోగించారో!"-అన్న సందేహమిప్పటికీ, నన్ను విడిచిపోలేదు సుమాండి.

మరి శెలవ్.

కథాంజలి
అన్ని హిగ్గిన్ బాథమ్సు బుక్ స్టాల్సు లోను దొరకును. వెల 0-2-0